మల్లిఖార్జునస్వామి జాతర ఉత్సవాలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
తూంకుంటలోని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో ఈనెల 22,23 తేదీలలో జాతర ఉత్సవాలుజరుగుతున్నట్లు భక్తులుపాల్గొనాలనితూంకుంట గ్రామమాజీసర్పంచ్ బి.దయాసాగర్‌యాదవ్ తెలిపారు.శుక్రవారం శామీర్ పేటమండలం తూంకుంటలోని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయజాతర వివరా లను వివరించారు. ఈనెల 22న సాయంత్రం పుట్టబంగారంకు పోవుట, గంగకుపోవుట, రాత్రి శ్రీమల్లిఖార్జునస్వామి, శ్రీభ్రమరాంబికాదేవి, గొల్ల కేతమ్మల ఒగ్గుకథ జరుగుతున్నట్లు తెలిపారు. ఈనెల 23న ఉదయం కొట్నంపెట్టుట, ఉదయం శ్రీమల్లిఖార్జునస్వామికల్యాణం జరుగుతుంద న్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం, అగ్నిగుండాలు తొక్కుట, గొలుసు తెంపుట, సాయంత్రం బోనాలు ఊరేగింపు సమర్పించు కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

అంధురాలి శస్త్రచికిత్సకు సన్‌రైజ్ ట్రస్టు ఆర్థికసాయం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
పేద అంధమహిళ శస్త్రచికిత్సకు సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆర్థికసాయం అందించింది. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్ చామాదంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన అంధురాలు సిహెచ్ పున్నమ్మకు గర్భసంచిలో గడ్డలవల్ల ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించాలని వైద్యులు నిర్ధారించారు. ఆమె కుమారుడు కూడా అంధుడు కావడంతో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆమె శస్త్రచికిత్స చేయించుకోవడానికి ఆర్థికస్తోమత లేక సాయం కోసం ట్రస్ట్ సభ్యులు అరుణకుమారిని ఆశ్రయించారు. ఈమేరకు శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సినగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో బాధితురాలి కుమారుడికి ట్రస్ట్ ద్వారా రూ.20,000ల చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో వై.సుందర్‌రావు, ఎం.శ్రీకాంత్, ఎ.వీరారెడ్డి, వి.ఎల్లప్ప, ఎన్.రామయ్య, టి.కృష్ణ తదితరులు చినపాల్గొన్నారు.

బిసి కులగణనలో అధికారులకు ప్రజలు సహకరించాలి: రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు

కులగణన కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
రాష్ట్రప్రభుత్వం రీసర్వే చేపట్టిన కులగణన వివరాలు అధికారులకు తెలుపాలని రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ అన్నారు. కులగణనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ శుక్రవారం పోచారం మున్సిపల్‌లో పర్యటించారు. గతంలో సర్వేలో పాల్గొనని వారి ఇళ్లకు వెళ్లి సర్వేచేసి వివరాలు నోటు చేసుకున్నారు. బిసిల ఉన్నతికొరకు ప్రభుత్వం బిసి కులగణన చేపట్టిందని సర్వేలో పాల్గొననివారు సర్వేలో పాల్గొని అధికారులకు వివరాలు అందించాలని కోరారు. బిసి కమిషన్ సభ్యురాలు వెంబడి కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్, నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

-మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


అమ్మవారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, తదితరులు

దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మజాతర బ్రహ్మోత్సవాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, పోలేపల్లి ఎల్లమ్మ చాలా మహిమగలతల్లి అని తెలంగాణనుండే కాకుండా పక్కరాష్ట్రాల నుండి సైతం లక్షలసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఈసంవత్సరం కూడా మంచిగా వర్షాలుకురిసి, పంటలు బాగాపండి నియో జకవర్గ రైతులు, తెలంగాణ రైతులు సంతోషంగా ఉండేలా దీవించమని ఎల్లమ్మతల్లిని కోరుకున్నానని తెలిపారు. ఎల్లమ్మ దేవస్థానం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 25కోట్లు నిధులుకేటాయించి అభివృద్ధి చేయాల న్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ దుద్యాల్, బొంరాస్‌పేట్ మండల అధ్యక్షులు చాంద్ పాషా, కోట్ల యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, శేరి నారాయణరెడ్డి, తమ్మలి బాలరాజ్, వెంకట్ నర్సింలు, రాజునాయక్, యాదయ్య, నరేష్ గౌడ్, రవిగౌడ్, సోంనాథ్, మడిగే శ్రీనివాస్, బసప్ప పాల్గొన్నారు.

గ్రామీణకృషి అనుభవ కార్యక్రమం

వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేసిన సామాజిక చిత్రపటం

ధారూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలపరిధిలోని కేరేల్లిగ్రామంలో తాండూర్ ఏరువాకకేంద్రం సమన్వయ కర్త శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ యమునారెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణకృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎడబ్ల్యుఈ కళాశాల విద్యార్థులు గ్రామంలో ప్రస్తుత పరిస్థితులు, సమస్యల ఆధారంగా రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయరంగంలో భాగంగా గ్రామంలో వెన్ రేఖాచిత్రం ఏర్పాటు చేశారు. ఎంత విస్తీర్ణంలో పంట విత్తనాలు విత్తాలి, రైతులకు ఉన్న వనరుల గురించి క్లుప్తంగా తెలిపారు. శాస్త్రవేత్త లక్ష్మణ్ మాట్లాడుతూ, ఈకార్యక్రమం వల్ల గ్రామంలో ఉన్న ఆర్థిక, సామాజిక, ప్రస్తుతపరిస్థితుల గురించి తెలుసుకోవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, మధుకర్‌రెడ్డి వంశీధర్, వంశీభరత్, వేణుగోపాల్, నరేందర్ పాల్గొన్నారు.

మానవాళి విముక్తికి మార్గం సోషలిజమే

-సిపిఎం జిల్లా నాయకులు

రెడ్‌బుక్ డేలో పాల్గొన్న యాదయ్య, సబిత తదితరులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
ఇండియా ఇరుగు పొరుగు దేశాలలో ఎర్రజెండా అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ప్రపంచం చూపు సోషలిజం వైపు పయనిస్తుందని సిపిఎం జిల్లా నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబితలు అన్నారు. ఘట్‌కేసర్‌లోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌బుక్‌డే నిర్వహించారు. సామాజిక రంగంలో శాస్త్రమే కమ్యూనిజం దాని లక్ష్యం షోషలిజం సాధన దాన్ని సాధించే దిశలో ఆయుధమే మార్క్సిస్టు సాహిత్యం దాన్ని యువతరంలోకి తీసుకుపోయిన వారికి దిక్సూచిలా మార్చడానికే ఫిబ్రవరి 21న రెడ్‌బుక్‌డే నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.చంద్రమోహన్, కడమంచి యాదగిరి, వరికుప్పల రాములు, శివారెడ్డి, వెంకటేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి,వీధికో బెల్టు షాపు-విచ్చల విడిగా మద్యం అమ్మకాలు

-అధిక ధరలతో మందుబాబుల జేబులకు చిల్లు
-చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొడంగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
కొడంగల్ ఎక్సైజ్‌డివిజన్‌పరిధిలో జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మద్యం ఏరులై పారుతుంది. గ్రామ గ్రామాన బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటుచేసి మందుబాబుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నా యి. గ్రామాల్లో ఉన్న చిన్నపాటి కిరాణాకొట్టులు సైతం మద్యందుకాణాలుగా తయారవుతున్నాయి. కొందరు మద్యం అమ్మేందుకే కిరాణాదుకాణాలు పెట్టుకున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించకపోవడంతో మూడు ఆఫ్‌లు, ఆరు క్వార్టర్‌ల లెక్కన బెల్టుదుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేస్తూ చేతులుదులుపుకుంటున్నారు. బెల్టు షాపుల నిర్వాహకుల తోపాటు వారికి మద్యం అమ్మిన వైన్‌షాపులపై కూడా కేసులు నమోదుచేస్తే బెల్టుషాపులు తగ్గుతాయని పలువురు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలోని అన్నిమండ లాల్లోని ఆయా గ్రామాలకు వైన్‌షాపుల నుంచి మద్యం భారీగా కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన మద్యం కాటన్‌లను బహిరంగంగానే ఆటో లు, బైక్‌లపై తీసుకు వెళ్తున్నప్పటికీ ఎక్సైజ్ అధి కారులు పట్టించుకున్న పాపానపోలేదు. కొన్ని గ్రామాల్లో ఇళ్ళలోకూడా బెల్టుషాపులు నిర్వహిస్తు న్నారు. చిన్న చిన్న టీకొట్టు కిరాణదుకాణాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉద యం 7గంటలకే తెరుచుకొనే బెల్టుషాపులు అర్ధ రాత్రివరకు కూడా మద్యం విక్రయిస్తున్నారు.దీంతో గ్రామాల్లో శాంతిభద్రతలకు కూడా భంగం కలుగు తుందని పలువురు పేర్కొంటున్నారు. బెల్టుదుకా ణాల్లో అధికధరలకు మద్యం విక్రయిస్తూ మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఒక్క క్వాటర్‌పై రూ.15నుంచి రూ.20వరకు పెంచి వి క్రయిస్తున్నారు. మండలపరిధిలోని చిట్లపల్లి, అంగడిరైచూర్, రుద్రారం, టేకులకోడ్, లక్ష్మీపల్లి, సంగాయపల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి, పాటి మీదిపల్లి, చిన్నసందిగామ, పెద్దసందిగామ, హస్నాబాద్, పర్సాపూర్‌తదితర గ్రామాలతోపాటు దౌల్తాబాద్‌మండలంలోని నీటూర్, నరా ్సపూర్, కౌడీడ్ తదితర గ్రామాలతోపాటు నియోజకవర్గం లోని మారుమూలగ్రామాల్లో బెల్టుషాపులు విచ్చల విడిగా కొనసాగుతున్నాయి. ఇదిలావుండగా మారు మూల గ్రామాల్లో సైతం బెల్టుషాపులు జోరుగా పెరుగడంతో రోజు,రోజుకు తగాదాలు కూడా పెరు గుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, మహిళా సంఘాలు ఆందోళన చెందుతున్నారు.మద్యం తాగి ఏదోకారణంతో చిన్నచిన్న మాటలతో గోటితో పోయేది గొడ్డళ్ళవరకు తగాదాలు జరుగుతుండడం తోపాటు భార్యాభర్తల గొడవలుకూడా ఎక్కువగానే జరుగుతున్నాయని పలుగ్రామాల ప్రజలు పేర్కొం టున్నారు. బెల్టుషాపులపై పలుమార్లు పోలీసు లకు, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టిం చుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు వాపోతు న్నారు. ప్రతి గ్రామంలో వీధికో బెల్టు దుకాణం ఉంటుందని పేర్కొంటున్నారు. బెల్టు షాపులను చూసీచూడనట్లు వదిలివేయడానికి కారణం మామూళ్ళేనని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపి స్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను తొలగించి గ్రామాల్లో పెరుగుతున్న తగాదాలను ఆరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బెల్టుదుకాణాలకు కాటన్‌లకొద్దీ మద్యం సరఫరాచేస్తున్న వైన్‌షాపుల యజమాను లపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను సిఎం రేంవత్‌రెడ్డికి అందజేస్తున్న ఆలయ చైర్మన్ నారాయణశర్మ

కీసర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావా లని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వానపత్రికను అందజేశారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మతో సహా ఆలయ ప్రతినిధులు సిఎం నివాసంలో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు జూపల్లి సాయిలు, మొరుగు ముత్యాలు, నల్ల మధుసూధన్‌రెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్ కుమార్, కందాడి రాజిరెడ్డి, పోచబోయిన రాజు, శ్యామల అమరేందర్, దుండిగళ్ల దుర్గాప్రసాద్‌గౌడ్, నల్లోల్ల కుమార్, సగ్గు అనిత, రాపోలు శంకరయ్య, పాముకుంట ప్రభాకర్ గౌడ్, క్రిష్ణారెడ్డి, ఫౌండర్ ట్రస్టీలు తటాకం రమేష్‌శర్మ, తటాకం వెంకటేష్, తటాకం ఉమాపతిశర్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాడి అంజిరెడ్డి, తటాకం భానుశర్మ, తటాకం లక్ష్మణ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఐజి సత్యనారాయణ

దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం, పోలేపల్లి రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దుద్యాల్ మండలం, పోలేపల్లి సమీ పంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకున్నారు. జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్, ఐజీ సత్య నారాయణ, జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రాష్ట్ర ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుండి రేణుక ఎల్లమ్మ దేవాలయానికి చేరుకుని ముఖ్యమంత్రి ప్రత్యేకపూజలు నిర్వ హించారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, శాసనసభ్యులు బుయ్యాని మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య, రామ్మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు. హెలిప్యాడ్ సమీపంలో ముఖ్యమంత్రి సెక్యూరిటీ అడిషనల్ ఎస్పీ వాసు దేవరెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌లతోపాటు దుద్యాల్, దౌల్తాబాద్ తహల్దార్లు కిషన్, గాయత్రి, దేవాలయ ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, రాష్ట్రపోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్‌చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, ముద్దప్ప, నందారం ప్రశాంత్, స్థానిక నాయకులు మేర్గు వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతయ్య, యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కావలి నరసింహులు తది తరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

శామీర్‌పేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి తనిఖీ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి తనిఖీలు చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను, రిజిష్టర్స్‌ను తనిఖీలు చేశారు. రెవెన్యూ రికా ర్డులను ఆయన పరిశీలించి వివరించారు. ఆ తరువాత రికార్డు రూమ్‌లను ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యాలయ పనితీరు గురించి తహసీల్దార్ యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఈడిఎం శ్రవణ్, డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కెసిఆర్ సిఎం అయ్యాకే పాలమూరుకు న్యాయం

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్

మీడియాతో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
కెసిఆర్ సిఎం అయ్యాక పాలమూరుకు న్యాయం జరిగిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, పాలమూరు ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్ రెడ్డి తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ మాట్లాడారు.

మాజీమంత్రి హరీష్‌రావు కృష్ణాజలాలపై ప్రశ్నిస్తే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని ఉమ్మరి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని, కాంగ్రెస్ హయాంలో రాజోలిబండ నీళ్లు వేరే ప్రాంతానికి మళ్లించారన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కెసిఆర్ హయాంలో మంత్రిగా ఉండి పాలమూరు ప్రాజెక్టులపై గొప్పగా మాట్లాడారని, ఇప్పుడు రాజకీయ కారణాలతో కెసిఆర్‌పై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. మమ్మల్ని తిడితే కృష్ణానీళ్లు రావని కాంగ్రెస్ నేతలు గ్రహించాలని హితవు పలికారు.

మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ విచారణ

-మున్సిపల్ భవన నిర్మాణ పనులపై సర్వే
-నిధుల దుర్వినియోగంపై నివేదిక
-ఉన్నతాధికారులకు అందజేస్తామన్న అధికారులు

మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కార్యా లయంలో రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం విచారణ చేపట్టారు. మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఫిర్యాదు అందడంతో శుక్రవారం విజిలెన్స్ అధికారులబృందం విచారణ ప్రారంభించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ డిఈతోపాటు ఇద్దరు ఏఈలు ఇతర అధికారులబృందం విచారణ చేపట్టారు. నూతన మున్సిపల్ కార్యా లయ భవనంలో చేపట్టిన పనులపై సమగ్ర సర్వే చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో తాండూరు పట్టణంలోని లారీ పార్కింగ్ సమీపంలో మున్సిపల్ నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.3కోట్ల37లక్షలనిధులతో కొత్త భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే 2020లోనే కొత్తభవనాన్ని నిర్మించినా కొంతకాలం అందుబాటులోకి తీసుకురాలేదు. 2021లో కొత్త కార్యాలయాన్ని ప్రారం భించారు. అదే ఏడాది మరో రూ.76లక్షల అదనపు నిధులతో వివిధనిర్మాణ పనులను చేపట్టారని, ఇందులో నిధుల దుర్వినియోగం జరిగిందని.. రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులబృందం శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యా లయాన్ని తనిఖీచేశారు. మున్సిపల్ కార్యాలయం భవనంతోపాటు కార్యా లయం ముందు వెనుక భాగాలలో చేపట్టిన నిర్మాణ పనులను పరిశీ లించారు. కార్యాలయంలో ఉన్న అన్ని విభాగాల గదుల కొలతలను సేకరించి హద్దులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కూడా తనిఖీచేశారు. అయితే ఈవిషయంపై విజిలెన్స్ అధికా రులు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. మున్సిపల్ భవన నిర్మాణం లో నిధుల దుర్వినియోగం జరిగిందని 2021లో ఫిర్యాదు అందడంతో విచారణచేపట్టడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదుచేసిన వ్యక్తితోపాటు అధికారుల పేర్లను గోప్యంగా ఉంచారు. ఈనివేది కను ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు. మరోవైపు విజిలెన్స్ అధికారుల బృందం మున్సిపల్ కార్యాలయంలో విచారణ ప్రారంభించడంతో ఇంజనీరింగ్ విభాగం అధికారుల్లో అయోమయం కనిపించింది.

బాలలక్ష్మికి కాంగ్రెస్ నేతల సన్మానం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్‌లో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాలక్ష్మిని శుక్రవారం మున్సిపల్ కాంగ్రెస్‌నాయకులు సన్మానించారు. ఘట్‌కే సర్‌లోని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ కార్యా లయంలో బాలలక్ష్మి కొద్దిసేపు నాయకులతో సమావేశమయ్యారు. ఈసంద ర్భంగా మున్సిపల్‌కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆమెను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

లారీని ఢీకొన్న టిప్పర్

పరిగి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
వికారాబాద్ జిల్లా,పరిగి పట్టణంలో ఏబివిస్ ప్లాజా దగ్గర అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ మరోలారీని ఢీకొట్టింది. పరిగిశివార్లలో రాత్రి సమయంలో మట్టిని గుట్టుచప్పుడుకాకుండా అక్రమంగా తరలిస్తూ, అతి వేగంతో రవాణా చేస్తున్నాయని సమాచారం.. గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాద ఘటనలో టిప్పర్ ముందుభాగం నుజ్జునుజ్జయింది. టిప్పర్ క్యాబిన్‌లో ఇరు క్కున్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. లారీడ్రైవర్ సంఘటనా స్థలంనుండి పారిపోయినట్టు తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు చేసిన టిప్పర్ డ్రైవర్...
లారీడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని టిప్పర్‌డ్రైవర్ న్యామత్‌నగర్‌కు చెందిన షర్ఫుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిఎస్ 12 యుఏ0329 గల లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

స్నేహితురాలు మాట్లాడకపోవడంతో ఆత్మహత్యాయత్నం

షాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
తోటిస్నేహితురాలు తనతో మాట్లాడడంలేదని మనోవేదనకుగురైన ఓ విద్యా ర్థిని స్పిరిట్‌తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన షాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకివెళితే ఆమనగల్ గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని తన తోటిస్నేహితురాలు తనతో మాట్లాడడంలేదని శుక్రవారం ఉదయం స్పిరిట్ తాగిందని, ఇది గమ నించిన ఉపాధ్యాయురాలు విద్యార్థిని షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. అక్కడ ప్రథమచికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారని, ప్రస్తుతం విద్యా ర్థిని పరిస్థితి నిలకడగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

అడ్డగుట్టలో పాడైన బోర్‌వెల్స్‌ను పరిశీలించిన జలమండలి ఏఈ

అడ్డగుట్టలో పాడైన బోర్లను పరిశీలిస్తున్న జలమండలి ఏఈ శ్రీనివాస్, బిజెపి నేతలు హంసరాజ్ తదితరులు

అడ్డగుట్ట,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: అడ్డగుట్ట పాడైన బోర్లను మరమ్మత్తులు చేపట్టాలని ఈ నెల 10వ తేదీన బిజెపి డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య జలమండలి జిఎం వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందిస్తూ శుక్రవారం ఏఈ శ్రీనివాస్ అడ్డగుట్ట డివిన్‌లోని మరాట బస్తీ, గడ్డమీది బస్తీ, సాయి నగర్,ఇందిరా లక్ష్మి నగర్,సాయిబాబా హై స్కూల్ లైన్‌లో ఉన్న పాడైన 15 బోర్లను వాటర్‌వర్క్స్ టెన్నికల్ సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జి.హంసరాజ్, శివలింగ చారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి : శంకర్ నాయక్

అడ్డగుట్ట,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: విద్యార్థులకు చట్టాపై అవగాహన కలిగి ఉండాలని,అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడకూడదని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఎం.శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం తుకారాంగేట్‌లోని షిరిడి సాయిబాబా హై స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్)ను విక్రయించే వారిని పోలీసులకు సమాచారం అందించాలని, ఆన్‌లైన్ గేమ్స్ ఆడకూడదని, మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. విద్యార్థులు అటువంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. దయాకర్, షిరిడి సాయిబాబా హై స్కూల్ కరస్పాండెంట్ ఎల్.శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎల్.వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రసంగిస్తున్న వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల డా.కె. ప్రభు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షులు డా. ఆర్. రమాదేవి అధ్యక్షతన "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ" సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభు, సీతాఫల్ మండి డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డా. కె. సైదులు పాల్గొని ప్రసంగించారు. భాష యొక్క ప్రయోజనం భావ వినిమయం తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించడమని, స్వాతంత్ర ఉద్యమ కాలంలో ఉద్యమ భావాలను, పోరాటాలను దేశీయమైన భాష ల్లోకి తర్జుమా చేయడం ద్వారా దేశమంతా చైతన్యమై ఐక్యంగా నిలిచిందన్నారు. ప్రపంచవిపణిలో నిలదొక్కుకోవాలంటే ఆంగ్ల భాషను నేర్చుకోవాలని, దానితో పాటు మాతృభాషలను గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్. లావణ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ కె. నీరజ, అధ్యాపకులు డా. పెబ్బేటి మల్లికార్జున్, డా. విజయ, డా.కళ్యాణి విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఫుట్‌బాల్ అకాడమీలు -టాఫా అధ్యక్షులు బల్విందర్‌నాథ్

కార్యక్రమంలో పాల్గొన్న బల్విందర్‌నాథ్, సుధాకర్‌రావు, మణికంఠరెడ్డి, సందీప్ చౌదరి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: అమెరికన్ ఫుట్ బాల్, ఫ్లాగ్ ఫుట్ బాల్ అకాడమీలు తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ అమెరికన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టాఫా) నూతన అధ్యక్షులు చాగన్ల బల్విందర్‌నాథ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్‌లను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలన్న టాఫా లక్ష్యంలో భాగంగా రాష్ట్ర నలుమూలల్లో ఈ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. 2025-28 కాలానికి టాఫా నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాబోయే రోజుల్లో టాఫా చేపట్టనున్న కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి నడిపల్లి సుధాకర్ రావు, భారత జట్టు కెప్టెన్ (అమెరికన్ ఫుట్‌బాల్) జీవి మణికంఠ రెడ్డి, ఏఎఫ్ఎఫ్ఐ సీఈవో సందీప్ చౌదరి ఎల్లతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా బల్విందర్ నాథ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ అకాడమీ స్థాపించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, ఇది యువతకు ఔత్సాహిక అథ్లెట్లకు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ క్రీడలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు. ఈ క్రీడలను రాష్ట్రవ్యాప్తంగా మండలాలు జిల్లాల స్థాయిలో విస్తరించేందుకు వీలుగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలు స్థాయిలో ఔత్సాహిక క్రీడాకారులను ఎంపిక చేసి తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాస్థాయిలో టాఫా అసోసియేషన్ లను ఏర్పాటు చేస్తూ, రాబోయే సంవత్సరాల్లో గచ్చిబౌలిలో ఫుట్‌బాల్ క్రీడాకు సంబంధించి అంతర్జాతీయ మ్యాచ్లను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. టాఫా ఉద్దేశాలను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

కంటోన్మెంట్,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో 2025-26 సంవత్సరంలో 5 నుంచి 9వ తరగతి వరకు గురుకులాల్లో చేరేందుకు ఈ నెల 23న 11 నుంచి 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మహేంద్రహిల్స్ ప్రిన్సిపాల్ శీలం సునీత తెలిపారు. ఎన్‌ట్రెన్స్‌కు గంట ముందు హాజరు కావాలని, హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆమె సూచించారు.

ఆంధ్రబాలానంద సంఘం 85వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: బాలానందం ట్రస్ట్, ఆంధ్రబాలానంద సంఘం 85వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు అధ్యక్షురాలు జి.వి.కామేశ్వరి, కార్య దర్శి డాక్టర్ జి.స్వర్ణబాల, ఉపాధ్యక్షుడు కలగా కృష్ణమోహన్ వివరించారు. 22న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త, ప్రసారభారతి విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ప్రయాగ రామకృష్ణ, ప్రముఖ పాత్రికేయులు డాక్టర్ మహ్మద్ రఫీ, ప్రముఖ లలిత సంగీత గాయకుడు, అపోస్టో వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎస్ ఆర్.మూర్తి తదితరులు పాల్గొనంటారన్నారు. ఈకార్యక్రమాన్ని పురస్కరించుకుని బాలానందం బాలలచే సాంస్కృతిక ప్రదర్శనలు, బాలలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

కూలిపోయిన బైరాగిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రహారీగోడ

- భయాందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు - భవనానికి మరమ్మతులు చేయాలని కమిషనర్‌కు వినతి

నార్సింగి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ ప్రభుత్వ పాఠశాల భవనం ప్రహారీగోడ గురువారం రాత్రి కూలిపోయింది. పాఠశాల భవనంకు కూడా చాలా వరకు నెర్రెలు వచ్చాయి. ఈ భవనాన్ని నాలుగేళ్ల క్రితం ఓ స్వచ్ఛంద సంస్థ తన నిధులతోనే నిర్మించింది. పనులలో నాణ్యతా లోపం కారణంగా ఇప్పుడా భవనం మొత్తం నెర్రెలు వచ్చాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఐదో తరగతి వరకు సుమారు వంద మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. పగటి పూట, పాఠశాల నడిచే సమయంలో ప్రహారీగోడ కూలి ఉంటే విద్యార్థుల ప్రాణాలు పోయేవని, పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి 12.ఏళ్ల లోపు చిన్నారేలే ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. రాత్రి సమయంలో ప్రహారీగోడ కూలి పోవడంతో పెను ప్రమాదం తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రహారీ కూలినట్లే పగటి వేళ ఈ పాఠశాల భవనం కూడా కూలితే వంద మంది విద్యార్థుల పరిస్థితి ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నిపుణులతో ఈ భవనం నాణ్యతను పరీక్షించాలని వారు కోరుతున్నారు.

పాఠశాలను సందర్శించిన కాంగ్రెస్ నేతలు

బైరాగిగూడలోని ప్రభుత్వ పాఠశాల ప్రహారీ

బండ్లగూడ కార్పోరేషన్‌లోని బైరాగిగూడ ప్రభుత్వ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్నా నాయకులు

గోడ కూలిపోయిన విషయంను తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోగాల శ్రీనివాస్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాఠశాలను సందర్శించారు. కూలిపోయిన ప్రహారీ గోడను పరిశీలించారు. నెర్రెలు పోయిన పాఠశాల భవనంను కూడా తిలకించారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంద్రమ్మతో కలిసి కార్పోరేషన్ కమీషనర్ శరత్ చంద్రకు వినతిపత్రంను అందజేశారు. పాఠశాల భవనంకు మరమ్మత్తులు చేయించాలని వినతిపత్రంలో కోరారు. కమీషనర్ శరత్‌చంద్ర ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి వెంటనే మరమ్మత్తులు చేయిస్తామని హామీ నిచ్చారు. వీలైనంత త్వరగా ఈ పాఠశాల భవనంకు మరమ్మత్తులు చేయించాలని, కూలిపోయిన ప్రహారీగోడను మళ్లీ నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు కమీషనర్‌ను కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం,స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటలు ఉధృతం చేస్తామని,ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసంఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం చిక్కడపల్లి ఎన్‌పిఆర్‌డి కేంద్ర కార్యాలయంలో సంస్థ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, యం అడివయ్య మాట్లాడుతూ జాలి, దయ, కరుణ మాకొద్దు, మా హక్కులు మాకు కావాలి అంటూ దేశ వ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేయడానికి 2010ఫిబ్రవరి 21,22 తేదీల్లో కలకత్తా పట్టణంలో ఏర్పడిందని,ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులను సమీకరించి పోరాటాలు చేస్తుందని అన్నారు. పార్లమెంట్ వేదికగా వికలాంగుల సమస్యలను చర్చించి అనేక సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేసిందని అన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యం చేసిందని బడ్జెట్టు సవరించి 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రయివేట్ పరిశ్రమలలో వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 21నుండి 27వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు

జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, యం అడివయ్య

నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకటేష్, ఖీనీ, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వికలాంగులను ఐక్యం చేసి పోరాటాలు నిర్మించడంలో సంఘం అగ్రభాగానే ఉందని అన్నారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలని అన్నారు.వికలాంగుల పట్ల కొనసాగుతున్న వివక్షత, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర సహాయ కార్యదర్శి జె దశరథ్ ,రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, జె మల్లేష్ ,నగర కార్యదర్శి అశోక్ రెడ్డి, విశిభిదీరాష్ట్ర నాయకులు రాజు,లక్ష్మిపతి, నర్సింగ్, లక్ష్మమ్మ, లక్ష్మణ్, లావణ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు ఛాయ సాహిత్యం : రచయిత గోపరాజు నారాయణ రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: చరిత్రకు ఛాయ సాహిత్యం అని జాగృతి పత్రిక సంపాదకులు, కథారచయిత గోపరాజు నారాయణరావు అన్నారు. శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కవిశేఖర జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన 'రేపటి స్వప్నం' గ్రంథావిష్కరణ సభ జరిగింది. చారిత్రకనవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణరావు గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. నేడున్న పరిస్థితుల్లో వర్తమాన పరిణామాల్ని సాహిత్యం నమోదు చేస్తోందన్నారు. ప్రస్తుతం సమాజంలో కంటే కుటుంబాల్లో సంక్షోభం ఎక్కువ ఉందన్నారు. ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ ఎవరి మాతృభాషను వారు గౌరవించకపోయినట్లయితే ఆ భాష అంతరించిపోవడం ఖాయమని అన్నారు. మాతృభాషపై చైతన్యాన్ని కల్పించడానికి సాహిత్యసదస్సులు నిర్వహించాలన్నారు. యునెస్కో వంటి సంస్థ ప్రపంచంలో అధికారిక లెక్కల ప్రకారంలో త్వరగా అంతరించిపోయే భాషలు కొనినన ఉన్నాయంటూ ఓ జాబితాను కూడా తయారు చేశారని, అందులో తెలుగు భాష ఉండడం ఆందోళన కలిగించే పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరాణిక నవలాచక్రవరినత త్రోవగుండ వెంకటసుబ్రహ్మణ్యం, ప్రముఖ నటులు, రచయిత డాక్టర్ అక్కిరాజుసుందరరామకృష్ణ, సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, నిర్వాహక సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సంగీత గురువు (గాత్రం, వీణ) నిర్వహణలో శ్రీలక్ష్మీనరసింహా సంగీత కళాశాల(నాగారం) విద్యార్థులచే భక్తి పాటలు అందరిని ఆధ్యాత్మిక వాతావరణంలో తేలియాడింది.

'రేపటి స్వప్నం' గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

అత్తాపూర్ ఫిబ్రవరి21,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బాబుల్ రెడ్డి నగర్ అంగన్వాడీ కేంద్రంలో నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి ఈ అంశంపై ప్రసంగిస్తూ, మాతృభాష మన సంస్కృతికి నాంది అని, దాని పరిరక్షణ మన బాధ్యతగా పేర్కొన్నారు. అలాగే చిన్నారులకు ప్రాథమిక స్థాయిల మాతృభాషలోనే విద్యాబోధన అందించాలి అనే సందేశాన్ని అందిం చారు. క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. మాతృభాష మన సంస్కృతి, మనకూ భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందించాల్సిన ముఖ్యమైన సంపద. అందుకే, ప్రతి ఒక్కరూ తమ భాషను ప్రేమించి, దానిని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలి" అని సూచించారు.అంగన్వాడీ కేంద్రం టీచర్ అనిత మాట్లాడుతూ నవ యువ యూత్ క్లబ్ మా కేంద్రం నిర్వహించాడం.చాలా సంతోషకార విషయమన్నారు. ఈ సందర్భంగా క్లబ్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్, వాడిగాచర్ల మల్లేష్, అంగన్వాడీ టీచర్ అనిత, హెల్పర్ సంగీత, ఇతర సభ్యులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు, కార్పోరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, ఫెడరలిజం కోసం పోరాడా లని మాస్ లైన్ కేంద్ర పోలిట్ బ్యూర్ సభ్యులు కె.జీ. రాంచందర్, రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రమ. ఎస్.ఎల్. పద్మ ఎం. హన్మేశ్, సదానందంలు పిలుపునిచ్చారు. ఇం దులో భాగంగా 28న న్యూఢిల్లీలో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండి యా కమిటీ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ దేశ వ్యాపితంగానూ, రాష్ట్రంలోనూ పార్టీ విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నా మని శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. ప్రధాని నరేంద్ర మోడి "సబ్కా సాత్, సబ్కా వికాస్" అని ప్రగల్భాలు పలికి 10 సంవత్సరాల తర్వాత అది "కార్పోరేట్ కా సాత్, కార్పోరేట్ వికాస్"గా మారిపోయిందని, ఈ 10 సంవత్సరాలలో జనవరి 31న విడు దల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం "కంపెనీల లాభాలు 15 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, అయితే నిజ వేతనాల్లో పెంపులేదని, కాని కార్పోరేట్ లాభాలు 22 శాతం పెరిగాయని, ఉపాధి 1.5 శాతం మాత్రమేనని, 4000 కంపెనీల ఆదాయం 6 శాతం పెరిగింది. అంటే మోడీ అభివృద్ధి కేవలం సంపన్నుల కేనని అన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని, కనీస మద్ద తు ధర లేదని, సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న ప్రకటించిన బడ్జెట్లో ప్రజానుకూలంగా లేదని, విద్య, వైద్యానికి జీడీపీలో 6 శాతం, 3 శాతం కేటాయించాలన్న డిమాండ్ కు స్పందన లేదని, పైగా ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతున్నద న్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఇచ్చిన 6 హామీలు అటకెక్కాయని, ఏదీ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజలు ప్రతినిధిగా నిలిచిన ఇల్లందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కు కలవడానికి అపాయింట్మెంట్ కూ డా ఇవ్వలేదని విమర్శించారు. రేవం త్ ప్రజా పాలన ఇట్టే అర్థమైపో తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 28న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాతృ భాషను కాపాడుకుందాం : జెడి లక్ష్మినారాయణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: యునెస్కో వారు విద్యాబోధనలో కనీసం మూడు భాషలు మాతృభాష, జాతీయ భాష, ఒక అంతర్జాతీయ భాషకు చోటుండాలని నిర్దేశించారని సి.బి.ఐ.మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధినేత మురళీమోహన్‌రాజు, కోటపాటి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం" సందర్భంగా కవిసమ్మేళనం, తెలుగు భాషా పురస్కారాల ప్రదానోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పసి ప్రాయంలో మాతృభాష ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టి, తరువాత మరో భాష నేర్చుకుంటే వారి విద్యా జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతుందని తెలిపారు. ఈసందర్భంగా పురస్కార గ్రహీతలు నర్ల సురేష్, దుబ్బ భాస్కర్ రావు, ఆమంచ అంజయ్య, కుండా భాస్కర్, అయ్యల సోమయాజుల ప్రసాద్, బుక్కపట్నం రమాదేవి, మిరియాల లక్ష్మి, జాన్సీ ముదుంబై, ఆలియా భాను, ఎమ్.పద్మావతి, సుహాసిని వాజపేయ్ లను అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూదన్ రావు, కవయిత్రి డాక్టర్ రాధ కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, కోటపాటి మురళి, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కోఆర్డినేటర్ వి.వి.మహేశ్వర రావు, టి.జయకుమార్, జాస్తి పూర్ణ ప్రసాద్, కోటపాటి రమేష్, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలను ప్రదానం చేస్తున్న సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మినారాయణ

సిటీ కళాశాల రహదారిలో పొంగిపొర్లుతున్న మురికి నీరు

సిటీ కళాశాల రహదారిలో పొంగి పొర్లుతున్న మురికి నీరు

చార్మినార్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : పాతనగరంలోని ప్రభుత్వ సిటీ కళాశాల రహదారిలో గత నెల రోజుల నుంచి మురికి నీరు పొంగి పొర్లుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.రహదారి మీద డ్రైనేజీ మురికి నీరు నిల్వ ఉండటంతో విపరీతమైన దుర్వాసన వ్యాపించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.ప్రతీ రోజు సిటీ కళాశాల కుడా స్టేడియం రోడ్డు మీదుగా వేలాది మంది ప్రజలు పలు ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు.వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ సిటీ కళాశాలకు చదువు కోవటానికి వస్తుంటారు.కాగా డ్రైనేజీ నిండి పోయి మురికి నీరు పారుతుండటంతో ప్రజలు గత్యంతరం లేక ప్రక్క నుంచే ప్రయాణం చేస్తున్నారు.రహదారి ప్రక్కనే మెడికల్ హాల్‌తో పాటు ఇతర దుకాణాలు ఉన్నందున ప్రజలు ఇక్కడకు వస్తుంటారు.మురికి నీటి దుర్గంధాన్ని భరించలేకప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.నెల రోజుల నుంచి మురికి నీరు రహదారిపై పారుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు.రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన దారులు డ్రైనేజీ మురికి నీటిలో జారి పడి గాయాల పాలవుతున్నారు.మురికి నీరు వల్ల దోమలు బెడద ఎక్కువగా ఉంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిటీ కళాశాల రహదారిపై పొంగి పొర్లుతున్న డ్రైనేజి అడుపుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సుస్థిరాభివృద్ధి అనుకూల జీవన విధానం మనందరి బాధ్యత

-స్కిల్ యూనివర్శిటి ఉప కులపతి ఎల్.వి.సుబ్బారావు

సదస్సులో పాల్గొన్న స్కిల్ యూనివర్శిటి ఉప కులపతి ఎల్.వి.సుబ్బారావు,ఉస్మానియా యూనివర్శిటి రిజిస్ట్రార్ జి.నరేష్ రెడ్డి

చార్మినార్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : సుస్థిరాభివృద్ధి అనుకూల జీవన విధానం మనందరి బాధ్యతని స్కిల్ యూనివర్శిటి ఉప కులపతి ఎల్.వి.సుబ్బారావు అన్నారు.ప్రభుత్వ సీటీ కళాశాలలో శుక్రవారం సిటీ కళాశాల కామర్స్ మేనేజ్ మెంట్ ఆధ్వర్యంలో సుస్థిర అర్థికాభివృద్ధి, ఆవిష్కరణలు ,మౌళిక సదుపాయలు,పారిశ్రామీకీకరణ అన్న అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఎటువంటి హాని కలగకుండుండేలా మన విధానాలు, పరిశ్రమలు,విద్యా వ్యవస్థలు అభివృద్ధి చెందాలని తెలిపారు.సదస్సుకు గౌరవ అతిథిగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు జి.నరేష్‌రెడ్డి మాట్లాడుతూ అర్థిక అభివృద్ధి, పర్యావరణ స్థిరత పరస్పర అనుసంధానంగా ఉండాలని తెలియజేశారు.కార్యక్రమంలో నల్సార్ విశ్వ విద్యాలయం ఆచార్యులు శ్రీనివాస సుబ్బారావు,సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్,ఆచార్య కృష్ణ చైతన్య,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్,విప్లవ దత్,డాక్టర్.జె.న

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాంగ్రెస్ నాయకుడు ఫిరంగి భాస్కర్

మొయినాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఈరుకోళ్ల మహేందర్ అనే మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఫిరంగి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, మొయినాబాద్ మండలంలోని మోత్కూపల్లి గ్రామానికి చెందిన ఫిరంగి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గ్రామంలో ఎవరికి ఆపద వచ్చిన నేనునానంటు తనవంతు బాధ్యతగా తన శక్తికొలది సహాయం అందించడానికి ముందుంటాడు, గురువారం మోత్కూపల్లి గ్రామంలో ఈరకోళ్ల మహేందర్ అనే వ్యక్తి మరణించారు, ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరమార్శించి, మృతదేహానికి నివాళ్ళుఅర్పించారు, ఆనంతరం వారి కుటుంబానికి భాస్కర్ మృతదేహ బౌతిక కాయానికి కర్చుల నిమిత్తం 5500 రూపాయలు అర్థిక సహాయం చేసి కుటుంబానికి అండగా నిలబడ్డాడు, ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడూతు ఆకస్మికంగా మరణించినా, ఎలాంటి ఆపద వచ్చినా నా గ్రామంలో సమాజం పట్ల నా వంతు బాధ్యతగా నా గ్రామంలో ఎవరికి అవసరమొచ్చినా నా యొక్క శక్తి మించి సహాయం చేస్తానన్నారు, నేను కాంగ్రెస్ పార్టీలో యువ నాయకుడుగా ఉన్నానని, మన యొక్క కనీస బాధ్యత మన చుట్టుపక్కల వారికి మనవంతు బాధ్యతగా సహాయం చేయాలని యువత, సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని అన్నారు, ఫిరంగి భాస్కర్ ను గ్రామంలోని పలువురు పెద్దలు ప్రశంసించారు, గతంలో కూడ భాస్కర్ ఏ ఇంట్లో ఉహించని సంఘటనలు జరిగినప్పుడు, ఆర్థికంగా మరియు అన్ని విధాలుగా తనవంతుగా బాధ్యగా సహాయం చేయడంలో ముందుంటారన్నారు, మంచి మనసున్న యువ నాయకుడని అన్నారు, ఈ కార్యాక్రమంలో గండయ్య, ప్రభాకర్, సురేష్ పాల్గొన్నారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 21 : ఎన్నికలకు ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మాటతప్పి, తెలంగాణ ప్రజలను మోసం చేశారని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి అప్పుడు ఒక మాట.. ఇప్పుడు ఒక మాట మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ప్రజలను మోసం చేసి మార్చి 13వ తేదీ లోపు కడితే 25 శాతం రాయితీ ఇస్తాననడం మాట తప్పడమే అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆనాటి ప్రభుత్వాన్ని ఎల్ఆర్ఎస్ విషయంలో విమర్శించి, నేటి మంత్రులు కేసులు కూడా వేశారని, మరి నేడు ఇచ్చిన మాట తప్పి అధికారంలోకి రాగానే మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాల వల్ల సామాన్యప్రజలుఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు కొండకల్ విద్యార్థి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: జాతీయస్థాయి షాట్ పుట్ పోటీలకు శంకర్ పల్లి మండలంలోని కొండకల్ గ్రామానికి చెందిన వరుణ్ గౌడ్ ఎంపికయ్యారు. మండలంలోని కొండకల్ గ్రామానికి చెందిన వరుణ్ గౌడ్ బాసర ట్రిపుల్ ఐటీ లో మొదటి సంవత్సరం చదువుతున్నారన్నారు. 11వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ లో రంగారెడ్డి జిల్లాకు చెందిన వరుణ్ గౌడ్ ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన డిస్కస్ త్రో, షాట్ పుట్ రంగారెడ్డి జిల్లా స్థాయిలో డీవైఎస్ఓ సాయిరెడ్డి, గోపి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెలలో జరిగినటువంటి ఈ నెల 18, 19న జరిగిన రాష్ట్రస్థాయి క్రీడలలో డిస్కస్త్రో షార్టుపుట్ లో శిల్వర్ మెడల్ సాధించాడన్నారు. ప్రెసిడెంట్ బి.ఈ స్టాన్లీజాన్స్, జనరల్ సెక్రటరీ కె. సారంగపాణి చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. మార్చ్ 20 తారీఖున పాట్నాలో జరగ బోయే జాతీయ క్రీడలలో పాల్గొనడం జరుగుతుంది జాతీయ స్థాయికి ఎంపిక కావడం వల్ల వరుణ్ గౌడ్ తల్లి తండ్రులు జి. లక్ష్మణ్ గౌడ్ కల్పన సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేసిన మున్సిపల్ నాయకులు

ఆర్థికసహాయం అందజేస్తున్న మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాత వార్త: పోచారం మున్సిపల్ అన్నానగర్‌కు చెందిన ప్రభాకర్ అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నాడొక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్నానగర్ 13 వ వార్డులో నివాసం ఉండే కాంగ్రెస్ కార్యకర్త అయిన ప్రభాకర్ కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితం అయ్యారు. దీంతో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్‌లు బాధితుడ్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి

పిండిగిర్నిని ప్రారంభిస్తున్న బ్యాంకు మేనెజర్ వెంకటేష్

జిల్లెడుచౌదరిగూడ, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: మహిళలు స్వయం ఉపాధితో ఎంతో అభివృద్ధి చెందుతారని యూనియన్ బ్యాంకు మెనేజర్ వెంకటేష్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామంలో ప్రధాన మంత్రి ఫుడ్ ప్రోసెస్ మైక్రో ఎంటర్ ప్రైజెస్ పథకం ద్వార మంజురు చేసిన పిండి గర్నిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిరాలు కుర్వరాధ బ్యాంకు మేనెజర్, అధికారులను శాలువాలతో సన్మాణించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నర్సంహా, సీసిలు రమేష్, దేవయ్య, వీఓ అధ్యక్షురాలు భారతి, విఓఏ యాదయ్య, షుశ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని సిఎంకు ఉత్తరాలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఉత్తరం రాశారు. గురుకుల్‌ను కాపాడుకుందాం అనే నినాదంతో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా పూర్వవిద్యార్థులు పోస్టుద్వారా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉత్తరాలు పంపారు. . పూర్వవిద్యార్థులతో కలిసి ఘట్‌కేసర్ తపాలా కార్యాలయంలో స్పీడ్‌పోస్ట్ ద్వారా సీఎం, మంత్రులకు ఉత్తరాలను పంపించారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు కొత్తకొండ వెంకటేశ్, మున్సిపల్ బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, అంజనేయులు, మమతాశర్మ, మధుసూధన్‌రెడ్డి, సురేందర్, అనిల్‌గౌడ్, నగేశ్, ప్రసన్న, కేఫా తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరానికి స్వచ్ఛమైన పుడమిని అందిద్దాం

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్ లక్ష్మారెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 21, ప్రభాత వార్త : ప్రకృతిని విస్మరిస్తే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, సహజ సిద్ధమైన వనరులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని. విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సిజిఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలో ఉన్న అనుమసుపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎర్త్ సెంటర్లో రెండు రోజులపాటు జరిగిన ఈ వర్క్ షాప్ లో పి ఎం శ్రీ మోడల్ స్కూల్ షాబాద్ నుండి 300 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానాన్ని కృత్యాద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిజిఆర్ అధికార ప్రతినిధి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అడవుల రకాలు మరియు విత్తనబంతుల తయారీ విధానం, బయో ఎంజైమ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి షాబాద్ మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్

రాఘవేంద్ర మాట్లాడుతూ ఎర్త్ ఎంటర్ కి రావడం చాలా సంతోషమని ఈ అవకాశం కల్పించిన సిజిఆర్ కు కృతజ్ఞత చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం ప్ నగేష్ పాల్గొన్నారు.

పెంజర్ల పద్మనాభ స్వామి ఆలయానికి ప్రముఖుల రాక

అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరుకానున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 21 : కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలోగల స్వయంభూ అనంతపద్మనాభ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నేటినుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, ఈనెల 24న ఆలయానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, అంజయ్య యాదవ్‌లు హాజరవుతున్నట్లు మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

నియోజకవర్గంలో ఉన్న ఏకైక అనంత పద్మనాభ స్వామిని దర్శించుకునేందుకు ప్రతిరోజు వెయ్యి మందికిపైగా భక్తులు వస్తున్నారని, తమకోరికలు తీరుతున్నందువల్లే ఇక్కడికి వస్తున్నట్లు భక్తులు చెబుతున్నారని మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు.

విశ్వవిజయ ఫౌండేషన్ ఔదార్యం

శివస్వాములకు పండ్లు అందజేస్తున్న దొంతు విశ్వనాథం దంపతులు

ఆమనగల్లు, ఫిబ్రవరి21, ప్రభాతవార్త: ఆమనగల్లు పట్టణానికి చెందిన విశ్వవిజయ ఫౌండేషన్ మరోసేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాద యాత్రతోశ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి వెళుతున్న శివమాల ధారణ భక్తులకు ఉచితం పాలు,పండ్లు, వాటర్‌బాటిళ్ళు అందజేయ నున్నారు. శుక్రవారం పట్టణంలోని మాడ్రన్ షాపింగ్ సెంటర్ ఎదుట ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ దొంతు విశ్వనాథం తన సతీమణి విజయలక్ష్మితో కలిసిశ్రీరామదూత ఆశ్రమ వ్యవస్థాపకులు శివానందస్వామి సమక్షంలో సేవా కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈసంధర్భంగా పలువురు శివస్వాములకుపండ్లు, వాటర్ బాటిళ్ళతోత్రాగునీరుఅందించారు. ఈసంధర్భంగాదొంతువిశ్వనాథం మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకుని వివిధ ప్రాంతాలను నుండి శివభక్తులు పాదయాత్రతో పుణ్యక్షేత్రం శ్రీశైలం బయలుదేరుతుంటారని, వారికి మార్గమధ్యలోఆహారం, త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో విశ్వవిజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఈసేవా కార్యాక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. ఫౌండేషన్ ఆశయం, సిద్ధాంతాలు సమాజశ్రేయస్సుకు తోడ్పడుతాయని వివరించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయం వినియోగదారులకు ప్రయోజనం చేకూరు స్తుందన్నారు. అంతేకాకుండా వేసవి సమయంలో పలు అనాథశ్రమాలకు ఉచితంగా మామిడిపండ్లు సైతం అందజేస్తున్నట్లు దొంతు విశ్వనాథం పేర్కొన్నారు. ఫౌండేషన్ సేవలపై పట్టణ ప్రజలు ప్రశంసిస్తున్నారు. కార్యక్రమంలో పొందుతుందన్నారు. కార్యక్రమంలో శివభక్తులు సహోర రేగట్టి శ్రీను, ప్రముఖ సీనియర్ వైద్యులు దొంతు పుల్లయ్య, దొంతు శ్రీనివాస్, దొంతు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పేదలకు సహకారం అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

కుల్కచర్ల,ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: నిరుపేదలకు సహకారం అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డిసిసి ఉపాధ్యక్షులు బొలనని భీమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పక్కిరి హుస్సేన్ బి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతురాలు నిరుపేద కావడంతో మేమున్నామంటూ తక్షణ సహకారంగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఽ అభివృద్ధిలోకి తీసుకురావడమే కాకుండా ఆపద సమయంలో సహాయం అందిస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ చెలిమిళ్ళ ఆనందం, డైరెక్టర్ నాగన్న ఎల్లయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్, పిఎసిఎస్ డైరెక్టర్ నాగన్నల్లయ్య, మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : విజయనిర్మల

చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: పంటల కోతల సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల సూచించారు. శుక్రవారం మదూర్ గ్రామంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ వరిపంటల కోతల సమయంలో అప్రమత్తం గా వ్యవహరించాలని, వరి కొతను కోసే సమయంలో ఆర్పిఎం 19-20 ఉం చేలా చూసుకోవాలని, ధాన్యం తూర్పారపెట్టిన తరువాత తేమశాతం 17లోపు ఉండాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామెనా భీమ్ భరత్

షాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: నేటి పోటీ ప్రపంచంలో మానవుడు తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని ఒత్తిడి దూరం కావాలంటే భక్తి మార్గం ఒకటే దారని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామెన భీమ్ భరత్ అన్నారు. షాబాద్ మండలంలోని సాయిరెడ్డిగూడా గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని శుక్రవారం భీమ భరత్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీకి 50 వేలను అందజేశారు. ప్రజలు ప్రతి ఒక్కరు భక్తితో పాటు సామాజిక సేవా భావాలను కలిగి ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి భార్గవ్ రాం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెంటారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, సర్దార్ నగర్ ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు గౌడ్, నాయకులు జాంగిర్, శేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, విఠలయ్య, యాదిరెడ్డి, ముత్యాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రవీందర్, నందు, తదితరులు పాల్గొన్నారు.

రోగాల బారి నుండి పశువులను కాపాడుకోవాలి

షాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: సీజనల్ వ్యాధుల నుండి రైతులు తమ పశువులను కాపాడుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 26 ఆవులకు చుడు పరీక్షలు, 12 పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ పరీక్షలు, 30దూడలకునట్టల నివారణ మాత్రలు తాపడం జరిగిందన్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

తెలుగు భాష దినోత్సవం కార్యక్రమంలో అధ్యాపక బృందం

పెద్దెముల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: పెద్దెముల్ మండలం కందనెల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోఅంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానో పాధ్యా యులు శెట్టి శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యతిథిగా ప్రముఖ కవి గంటా మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో మనకు అవసరమైన భాషలు ఎన్ని నేర్చుకున్నపటికి, తల్లితో సమానమైన మాతృభాషను ఎన్నటికీ మరు వకూడదని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధిం చాలని చెప్పారు. అనంతరం వడిచర్ల సత్యం రచించిన మణిపూసలను వందకు పైగా కంఠస్థం చేసిన ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈదులపల్లి మహేష్ కు, తాటికొండ శృతిలయకు మణిఏ ాసల కంఠభూషణ పురస్కారంతో సత్కరించి అభినందించారు. హైదాంాబాద్ కు చెందిన గోల్కొండ సాహితీ కళా సమితి తరఫున ఈ పురసాారాన్ని అంద జేశారు. అంతకు ముందు నిర్వహించిన పాటలు, పద్యా లు, ఉక్తలేఖనం, వక్తృత్వం పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహు మతులను అందజేశారు. తదనంతరం తెలుగు భాషను బోధిస్తున్న ఉపా ధ్యాయులు వడిచర్ల సత్యం, టి.పద్మ లను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు డి.శివప్రసాద్, కె. శోభారాణి, కె.అనురాధ, ప్రవీణ్ జాదవ్, జరీన, ఏ.రాధాకృష్ణ, జె.సంతోష్ కుమార్, గాజుల బస్వరాజు, కె.రమాదేవి, సీతాలావణ్య, స్వప్న, రాఘవేందర్, నర్సి ములు పాల్గొన్నారు.

ప్రజల్లో ప్రాంతీయ తత్వం రెచ్చగొడుతున్న కెసిఆర్

కెసిఆర్ వ్యాఖ్యలపై టిడిపి మండిపాటు మీడిమా సమావేశంలో 'బక్కని' ఫైర్

షాద్‌నగర్,ప్రభాతవార్త,ఫిబ్రవరి21: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అంటే తెలంగాణ మాజీముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎందుకంతభయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కనినర్సింహులు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో రూపంలో తెలంగాణ రాజకీయాల్లో వస్తున్నారని కేసీఆర్ఇటీవలే వ్యాఖ్యలు చేయడం అర్థ రహితమని బక్కని విమర్శించారు. ప్రాంతాల పేరిట వైష మ్యాలను రెచ్చగొట్టి రాజకీయాల్లో స్వార బుద్ధితో వ్యవహరించిన కేసీఆర్ చంద్ర బాబును విమర్శించడం ఆయన అవి వేకానికి నిదర్శమని అన్నారు.

ముఖ్య మంత్రినారాచంద్రబాబు నాయుడు దూరదృష్టి గల ఓ విజన్ కలిగిన నాయకు డని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20-20 విజన్‌ద్వారా అభివృద్ధి చేశారని, అదేవిధంగా ప్రస్తుత తరుణంలో 2047విజన్ కలిగిన నాయకుడని వివరించారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ఏ విజన్‌లేని నాయకుడని విమర్శించారు. ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చ గొట్టి ఇరుప్రాంతాలను విడదీసిన నాయకుడు కెసిఆర్ అనిఅన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాలికి ముళ్లు గుచ్చితే పంటితో తీస్తానని చెప్పిన కేసీఆర్ చంద్రబాబుపై విషం కక్కుతుండడ ంఆశ్చర్యంవేస్తుందని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం విలీనం తర్వాత మొదట పశ్చిమ బెంగాల్‌కు చెందిన మిలటరీ అధికారి జయంత్ నాథ్ చౌదరి, కేరళకు చెందిన ఐపీఎస్ అధికారి ఎంకె వెల్లోడి, అదేవిధంగా 1952లో షాద్‌నగర్‌కు చెందిన బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా పాలించారని గుర్తు చేశారు. కర్ణాటక జిల్లాలు హైదరాబాద్ పరిధిలో ఉండగా పాలించారని, ఆ చరిత్రలు కేసీఆర్‌కు తెలియదా అనిబక్కని ప్రశ్నించారు. హైదరాబాద్ రాష్ట్రంలో తిరుపతిలో మిలటరీ సెంటర్‌గా ఆనాడు తెలుగువారు అక్కన్న, మాదన్నలు రాసిన పుస్తకంలో ప్రస్తావించలేదా అని పేర్కొన్నారు. .విడిపోయిన అన్నదమ్ము లవలె ఉండాలని చెప్పిన కేసీఆర్ తాను ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో మాజీ ముఖ్య మంత్రి వైయస్‌జగన్‌ను ప్రగతి భవన్‌కు ఆహ్వా నించలేదా?అని అన్నారు. రాయలసీమ పర్య టన సందర్భంగా ఆంధ్ర చేపల పులుసు తిని రాయలసీమ రత్నాలసీమ చేద్దాంఅని ఆనాడు ప్రకటించలేదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీతో అనాడు కేసీఆర్ పొత్తు పెట్టుకొని మహ బూబ్‌నగర్ పార్లమెంటు సభ్యుడిగా గెలవలేదా అనిబక్కని నర్సింహులు ప్రశ్ని ంచారు. టిడిపి శ్రేణులు కెసిఆర్‌కు అనాడు ఓట్లు వేసి గెలిపించ లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ ప్రాంతంలో భూముల విధ్వంసాన్ని సృష్టించింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. ధరణి పేరుతో రైతుల భూములను కొల్లగొట్టి కాస్తు కాలాన్ని నాశనం చేసిందికేసీఆర్ అని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు ఎంత మేలు జరిగిందో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలే చెబుతారని అన్నారు. మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ రాజకీయ కుట్రపూరిత విద్వే షాలతోమాట్లాడడం మానేయాలని అలా మాట్లాడితే ఖబడ్దార్ అని బక్కని నర్సింహులు హెచ్చరించారు.

ఎదిరలో మహాపడి పూజ

ఉదిర గ్రామంలో పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శివస్వాములు

జిల్లెడుచౌదరిగూడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్త: జిల్లెడుచౌదరిగూడ మండలం లోని ఎదిర గ్రామంలో జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమాన్ని గురుస్వామి కమ్మరిభూపాలచారి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ పరమశివున్ని ఆరాదించే వారికి కష్టాలు ఉండవని అన్నారు. భోళా శంకరుడు కొరిన వారికి కొండంత అండగ ఉంటాడని తెలిపారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి కొలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శివ భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 21 : షాద్‌నగర్ పట్టణంలోని శుక్రవారం నిర్వహించిన మహబూబ్‌నగర్ జోనల్ లెవల్ అబాకస్ పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. షాద్‌నగర్, వనపర్తి నారాయణ పాఠశాలల మధ్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలలకు చెందిన 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో గెలుపొందిన షాద్‌నగర్ నారాయణ పాఠశాల విద్యార్థులకు బహుమతులతో పాటు ధృవపత్రాలు అందజేశారు. విద్యార్థి ప్రగతి సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఉండాలని అన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసే దిశగా, విద్యార్థులలో పోటీతత్వం అలవడే విధంగా విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా పాఠశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎజ

కంకల్‌లో వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయం

పూడూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
పూడూరు మండలపరిధిలోని కంకల్‌గ్రామంలో వెలసిన శ్రీవీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు (జాతర కార్యక్రమాలు) ఈనెల 23వ తేదినుండి మార్చి 1వ తేదివరకు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 23వతేది ఆదివారం ధ్వజారోహణం, 24వ తేది సోమవారం గీతాయజ్ఞము, పారాయణము, 25వతేది మంగళవారం మృత్యుంజయహోమం, రుద్రహోమం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 26వతేది బుధవారం మహాశివరాత్రి, రుద్రాభిషేకం, 27వతేది గురువారం తెల్లవారుజామున అగ్నిగుండము, 28వ తేది శుక్రవారం శ్రీస్వామివారి రథోత్సవము, రాత్రికి వీరభద్రవిజయం(ఆటా) ఉంటుందని వివరించారు. మార్చి 1వతేది శనివారం పార్వతీపరమేశ్వరుల కళ్యాణం, రాత్రికిసేవ, మానసపూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని అన్నారు. ఈ ఉత్సవాలకు వివిధజిల్లాల్లోని ఆయాగ్రామాలకుచెందిన భక్తులు భారీసంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కొడంగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
కొడంగల్ పురపాలక కార్యాలయంలో వ్యాపారస్థులు, సిబ్బందితో కలిసి తడి,పొడిచెత్తను వేర్వేరు చెత్తబుట్టల్లో వేసి కంపోస్టు తయారు చేయడంపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగతశుభ్రత పాటించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, పరిసరాలు, వ్యక్తిగతశుభ్రత పాటించకపోతే ప్రబలే వ్యాధులపై వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, భరత్‌లతోపాటు వ్యాపారస్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా అమ్మవారి సిడే



అమ్మవారి సిడే కార్యక్రమం నిర్వహణ

దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మజాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగురోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారి సిడేలాగే కార్యక్రమం భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. తెలంగాణరాష్ట్రం నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలనుండి భక్తులు వేలసంఖ్యలో భారీగా పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలోభాగంగా నేడు రథోత్సవం (తేరులాగే) కార్యక్రమం నిర్వహించనున్నారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మహ బూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేం దర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిని చాటుకున్న శివసత్తు.. అమ్మవారి విగ్రహంతో ప్రదక్షిణలు..

అమ్మవారి విగ్రహంతో ప్రదక్షిణలు చేస్తున్న శివసత్తు

దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలంలోని పోలేపల్లి జాతర ఉత్సవాల్లో అమ్మవారి విగ్రహంతో ప్రదక్షిణలుచేసి తనభక్తిని చాటుకున్నారు శివసత్తు. తెలంగాణలో మినీ మేడారంగా పిలవబడే కొడంగల్ నియోజకవర్గంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో కొడంగల్ పట్టణంలోని గాంధీనగర్‌కాలనీకి చెందిన శివసత్తు నందారం దస్తప్ప అమ్మవారి విగ్రహంతో ఆలయంచుట్టూ ప్రదక్షిణలుచేసి భక్తిని చాటుకున్నారు. ఉత్సవంలో భాగంగా శుక్రవారం జరిగిన సిడేకార్యక్రమంలో సిడేతొట్టెలముందు శివసత్తు దస్తప్ప అమ్మవారి విగ్రహాన్ని తలపై ఉంచుకొని ప్రదక్షిణ చేస్తూ తన భక్తిని చాటుకున్నాడు.

ప్రభుత్వ పథకాలను అందించేందుకు పూర్తిస్థాయి సర్వే

-బిసి కమిషన్ సభ్యురాలి పర్యటన

ఘటకేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలను అందిస్తారని సర్వేలో మిగిలిపోయిన కుటుంబాలు రెండోవిడతలో సర్వే చేయించుకోవాలని తెలంగాణ బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. ఘటకేసర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఆమెపర్యటించి సర్వేనుపరిశీలించారు. పురపాలకసంఘం కార్యాలయంలో ఆమె కమిషనర్ బి.చంద్రశేఖర్‌తోపాటు సర్వేచేసిన సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఘటకేసర్ మున్సిపల్ పరిధిలో ఐదుగురు సూపర్‌వైజర్లతో 60 బ్లాకులలో 60మంది ఎన్యూమరుటర్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేను పూర్తిచేశారని తెలిపారు. సర్వేను విజయవంతం చేసినందుకు బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి వారిని అభినందించారు. సర్వేలో పాల్గొనకుండా మిగి లిపోయిన కుటుంబాలకు ఈనెల 16నుంచి 28వరకు ప్రభుత్వం మరొక అవకాశం ఇస్తుందని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం విద్య, ఉద్యోగం ప్రతి ఒక్క వెనుకబడిన కులాలు, అన్ని వర్గాల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమపథకాలను పూర్తిస్థాయిలో అందించడానికి ఇంటింటికి సర్వేచేశారని ఆమె తెలిపారు.

సమిష్టిగా పనిచేస్తేనే విజయం సాధిస్తాం : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా,పట్టుదలతో కృషి చేస్తేనే ఏదైనా విజయం సాధించగలమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి ఆల్పోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అసిఫాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి పలు సూచనలుఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్, నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్యామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రహిల్స్‌లో ఘనంగా నందిశ్వర విగ్రహ ప్రతిష్టాపన

కంటోన్మెంట్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ రవి కాలనీ సాయి శిఖరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీసాయిబాబా దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం నందిశ్వర, విగ్రహ, శ్రీ కాశీ విశ్వేశ్వర ధ్వజ స్థంబ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరణలతో విగ్రహ ప్రతిష్టాపన పూజలు అంగరంగ వైభవంగా జరగాయి. ఆర్టీసి మాజీ చైర్మన్, ఆలయ ట్రస్టీ పౌండర్ కొత్త సంజీవరెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు ఉదయం నుంచి ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, ట్రాన్స్‌కో ఛీఫ్ ఇంజనీర్ సంపత్ కుమార్, చంద్రమోహన్, శ్రీనివాస్ రెడ్డి, సదాశివరెడ్డి,శ్రీనివాస్ రావ్, నందినిరెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషను, సాహిత్యాన్ని పరిరక్షించాలి

టిడిపి సికింద్రాబాద్ పార్ల మెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: తెలుగుభాషను, సాహిత్యాన్ని పరిరక్షించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ వైభవానికి ప్రతిరూపంగా ట్యాంక్‌బండ్‌పై ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిర్మించిన తెలుగు వెలుగుల కళామూర్తుల ప్రాంగణాలు నేడు ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో శిధిలావస్థలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలుగుభాష కోసం ఎంతో కృషి చేసిన ఎన్టీఆర్ పేరుతో నిర్మించబడిన ఎన్టీఆర్ ఘాట్ కూడా పర్యవేక్షణ లేక శిధిలావస్థకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, కళామూర్తుల ప్రాంగణాలకు, ఎన్టీఆర్ ఘాట్‌కు మరమ్మత్తులు చేయించి, పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మాతృభాషా పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తెలుగు సాహితీవేత్తలైన దాశరథి రంగాచార్య, కళోజీ, డాక్టర్ సి. నారాయణరెడ్డి మొదలైన వారిని స్మరించుకుంటూ వారి పేర్లమీద స్మారక అవార్డులు తెలుగుభాష కోసం పాటుపడుతున్న వారికి ప్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్,పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు సిసి కెమెరాల ఏర్పాటు

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

ఆలయాల ప్రవిత్రను కాపాడటంతో పాటు వాటి భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని సనత్‌నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వి.రామూరావునగర్ శివాలయం 14వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకుని స్థానికులు 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాలను ఇన్స్పెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగుల సత్యం, ఎన్ నరసింహా, రామకృష్ణయాదవ్, అధ్యక్షులు సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్‌లో టాయిలెట్స్‌ను నిర్మించాలి : కొంతం దీపిక

అడ్డగుట్ట,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని ఆర్.పి. రోడ్డు, నాలా బజార్ పరిసర ప్రాంతాల్లో వ్యాపార వాణిజ్య సముదాయ దుకాణాల దారులకు మోడ్రన్,పబ్లిక్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని శుక్రవారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో సమావేశమైయ్యారు. ఆయా ప్రాంతాలో ని ఉగ్ర నరసింహ స్వామి మజీద్ మధ్యలో ఉన్నమూత్ర శాలలు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో నూతన టాయిలెట్స్‌ను నిర్మించేందుకు 12 లక్షలు నిధులు మంజూరైన పనులు చేపట్టడం లేదని ఆమె అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఇంజనీర్లు సుబ్రమణ్యం, అంజనేయులు, ధనాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకి ఆరోగ్య .. జీవిత బీమా

హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
జర్నలిస్టులకి హెల్త్ ఇన్సూరెన్సు కల్పించడంతో పాటు జీవిత బీమా కల్పించేదానిపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తామన్నారు. ఇండ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రెటేరియేట్‌లో హైదరాబాద్ యూ నియన్ అఫ్ జర్నలిస్ట్స్ 2025 డైరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీష్ జర్నలిస్టుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధా నంగా, జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేయడం లేదని చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాలకి ప్రతి ఏడాది రూ.10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం లో జర్నలిస్టుల హెల్త్ స్కీం కలిపి అన్ని ప్రయివేట్ , కార్పొరేట్ హాస్పిటల్స్ లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం రైతు బీమా అమలు చేస్తున్నట్లు..అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా కింద జీవిత బీమా అమలు చేయాలని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టు చనిపోతే వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలు అందేలా ప్రభుత్వం జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరారు. సానుకూ లంగా స్పందించిన డిప్యూటీ సీఎం జర్నలిస్టుల ఆరోగ్య బీమా , జీవిత బీమా, హెల్త్ కార్డులపై తగిన నిర్ణయం తీసుకుం టామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ట్రీట్మెంట్ తీసుకుని ఇంటి దగ్గర రెండు మూడు నెలలు రెస్ట్ లో ఉండే జర్నలిస్టులకూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక సహకారం అందించే విషయమై పరిశీలన చేస్తామన్నారు. ఇండ్ల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచన చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజ శేఖర్, నాయకులు రామకృష్ణ, చిట్యాల మధుకర్, క్రాంతి, ప్రశాంత్, కొడవటి నవీన్, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, శేఖర్ పాల్గొన్నారు.

ముస్తాబైన భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయం

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :
బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం సైట్2 కాలనీలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి ప్రాంగణంలో శ్రీమల్లన్నస్వామి జాతర, 17వ కళ్యాణమహోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 22శనివారంనుంచి 24 సోమవారం వరకు ఈవేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మానుక మహేష్‌యాదవ్ తెలిపారు. ఈనెల 22 శనివారం ఉదయం గంగా తెప్పోత్సవం, 23 ఆదివారం ఉదయం స్వామివారికళ్యాణం, భక్తులకు పెద్దఎత్తున అన్నదానం, మధ్యాహ్నం పెద్దపట్నం, మధ్యాహ్నం అగ్నిగుండాలు, గొలుసుతెంపుట, సాయంత్రం మలన్నస్వామి బోనాలు, సోమవారం ఉదయం నాగవల్లితో ఉత్సవాలతో ముగుస్తాయని పేర్కొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ కోసం పిటిసి

బేగంపేట ఫిభ్రవరి 21,ప్రభాతవార్త

ఆస్తి పన్ను ప్రాపర్టీ ట్యాక్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం పీటీపీ కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి మార్చి 29వరకు ప్రతి శనివారం ఉదయం గం 10ల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బేగంపేట సర్కి ల్ డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య తెలిపారు.ఈ కార్యక్ర మంలో పన్ను సమస్యలు పున:సమీక్ష అభ్యర్థనలు ఆస్తి పన్ను సవరణలు కోర్టు కేసులు టాక్స్‌కు సంబంధించిన ఏ సమస్య అయినా ఆఫీసుకు వచ్చి తెలియజేయాలని అన్నారు. ప్రాపర్టీ టాక్స్ పరిష్కార కార్యక్రమం ఈ నెల 22 నుంచి మార్చి నెల ఒకటి ,8,15,22,29తేదీల్లో ఉదయం గం 10ల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యా లయంలో తీసుకోనున్నట్లు ఆయన వివరించారు.ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీ సమ్మయ్య కోరారు.

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ స్టాడింగ్ కమిటీ సభ్యుడినిగా జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

దశాబ్దకాలం తర్వాత గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ స్టాడిం గ్ కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికవడం సంతోషంగా ఉందని మాదాపూర్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ స్టాడింగ్ కమిటీ సభ్యులుగా శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడు తూ. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామని, తన దృష్టికి వచ్చిన ప్రతి మౌళిక వసతుల సమస్యల పర ష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలోని కాలనీ,బస్తీల అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టేలా చూస్తామన్నారు.తనపై నమ్మకంతో గ్రేటర్ హైదరా బాద్ స్టాడింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, దుద్దిల శ్రీధర్‌బాబు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీలకు ప్రత్యేకంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ హైదరా బాద్ స్టాడింగ్ కమిటీ సభ్యునిగా తనవంతు సేవలను అంది స్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఘంటసాల బాలు పాటలు తెలుగు భాషకు వన్నె తెచ్చాయి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: విఖ్యాత గాయకులు ఘంటసాల ఏస్. పి.బాల సుబ్రహ్మణ్యం పాటలు తెలుగు భాష కు వన్నె తెచ్చాయని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. వారి పాటలో మాధుర్యం మాత్రమే కాక తెలుగు భాష ఉచ్చారణ భాష లోని అందం శ్రోతలకు అందించిందని అయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ సందర్భంలో వీరి పాటలు ఎంపిక చేసుకోవ టం సముచితంగా ఉందన్నారు. శుక్రవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) నిర్వహణలో ప్రముఖ గాయకుడు దాసరి శ్రీహరి సారథ్యంలో పాటకు పట్టాభిషేకం పేరిట ఘంటసాల బాల సుబ్రహ్మణ్యం సినీ గీతాలను వై.ఎస్ రామ కృష్ణ, ఇందున యన, నంది అవార్డుగ్రహీత సురేఖామూర్తి తదితరులు మధురంగా పాటలను ఆలపించారు. శ్రీహరి సహా గాయ కులతో కలసి ఆలపించిన 'వాడిన పూలే వికసించేనే' పాటను సుమధుర స్వరంతో పాడారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వంశీ రామరాజు పాల్గొని గా యకులను సత్కరించి మాట్లాడారు. నేటి వారికి ఘంటసాల పాటలు వినిపిస్తే తెలుగు భాష పై మక్కువ పెరుగుతుంద న్నారు. ఉత్తమ కార్యక్రమాలు చేసే వారికి వంశీ సంస్థల సహకారం అందిస్తామని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం

ముషీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: అప్పుల బాధ పడలేక ఒక వ్యక్తి ఇంటినుండి వెళ్లిపోయిన ఘటన దోమల గూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడలోని గగన్‌మహల్ వద్ద నివసించే జితేందర్ దస్వాని (53) భార్య ఐదు సంవత్సరాల క్రితం క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిం ది. జితేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కొడుకుతో కలసి ఉంటున్నాడు. భార్య చికిత్స నిమిత్తం అప్పులు కావ టంతో అవి తీర్చలేక జితేందర్ ఇబ్బందులు పడుతూ ఉన్నా డు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీ సాయంత్రం ఇంటి నుండి చెప్పకుండా జితేందర్ ఎక్కడకో వెళ్లి పోయాడు. బయటకు వెళ్లిన జితేందర్ తిరిగి రాకపోవటంతో ఆయన ఆచూకీ కోసం బంధువులు ప్రయత్నించారు. జితేందర్ ఆచూకీ దొరకకపోవటంతో శుక్రవారం దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జితేందర్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పికెట్‌లోని కేంద్రియ విద్యాలయంలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో స్కూల్ ప్రిన్సిపాల్ రూపిందర్ సింగ్,హెడ్ మాస్టర్ పి.ఎస్.నాగలక్ష్మి, పి.జి.టీ. టీచర్ మధుసూదన్, 5వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్న జాయింట్ కమిషనర్

రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య, బంధువులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్తః జీహెచ్ఎంసీలో అడ్మిన్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జానకీ రామ్ రాసలీలల వ్యవహారం బయటపడింది. వేరే మహిలతో ఒక ఇంట్లో కలిసి ఉండగా అతని భార్య కల్యాణి, బందువులు కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన వారా సిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్‌లో శుక్రవారం జరిగింది. జానకీరామ్ గతకొన్ని రోజులుగా ఇంటికి రాకపోవడంతో ఎక్కడికి వెళుతున్నాడోనని భార్య, బందువులు నిఘా పెట్టారు. బౌద్ధనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నట్లుగా తెలుసుకొని శుక్రవారం ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టున్నారు. జానకీరామ్‌ను, అతనితో 20 సంవత్సరాల తక్కువ వయసు ఉన్న యువతిని కల్యాణి, బందువులు కలిసి చితకబాదారు. జానకీరామ్ ఎక్కడి విధులు నిర్వహించినా అక్కడా ఇలాంటి పనులే చేస్తుంటాడని, అమ్మాయిలతో ఆక్రమ సంబంధాలు కొనసాగిస్తాడని బంధువులు తెలిపారు. చుట్టుపక్కల ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారం అందించడంతో వారా సిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాల ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ 5వ మహాసభలు

సైఫాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:
తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహాసభలు ఈ నెల 23వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూని యన్ సలహాదారులు చామకూర రాజు, కె.వి.గౌడ్, శ్యాంసుం దర్‌గౌడ్, అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో 40,500 మంది కుకింగ్ గ్యాస్ డెలివరి వర్కర్స్ ఉన్నారని, ఈ కార్మికులను గ్యాస్ ఏజెన్సీలు శ్రమదోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు కొన్ని ఏజెన్సీలు కనీస వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేస్తు న్నాయని, కార్మిక శాఖ, సివిల్‌సప్లై శాఖ అధికారులు కార్మికు లను పట్టించుకోవడం వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభు త్వాలు పట్టించుకుని కార్మికులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు చంద్రయ్య, యూసఫ్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు

ఆర్టిజన్స్ కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్స్‌లను ప్రభు త్వం వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలోని వివిధ విభాగాల్లో 20 వేల మందికిపైగా ఆర్టిజన్స్ పనిచేస్తున్నారని, వారు జేఎల్ఎంలుగా, సబ్ ఇంజనీర్లుగా, జూనియర్ అసిస్టెంట్‌లుగా, ఆఫీస్ సారిగ్రనేటర్స్‌గా దశాబ్దాలు తరబడి పనిచేస్తూ వస్తున్నారని జెఎసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఈశ్వర్‌రావు, ఎం.ఎ.వజీర్, వి.నరేందర్, సి.హెచ్.ఎల్లయ్య మాట్లాడుతూ డిమాండ్ల సాధన కోసం గురువారం ఆర్టిజన్స్ చేపట్టిన 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకుని పోలీసుల తో అణిచివేసిందని, ఆనేక మందిని నిర్బందించి అరెస్టు చే యించిందని ఆరోపించారు. చలో విద్యుత్ సౌధ కార్యక్రమం లో పాల్గొన్న ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం లేదని అధిక